


ఐలమ్మ వర్ధంతిలో నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డిలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

- ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చాకలి ఐలమ్మ వర్ధంతిలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికి, చైతన్య స్ఫూర్తిని నింపిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలన్నారు.





మన్నించయ్యా..

గంగమ్మఒడిలో జలనిద్ర చేస్తూ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపిస్తున్నాడు బొజ్జగణపయ్య. సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువులో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలు ఇంకా సగం తేలియాడుతున్నాయి. మున్సిపల్ సిబ్బంది పూర్తిస్థాయిలో గణనాథులు మునగకుండానే నిమజ్జనం ముగించడంతో విగ్రహాలు ఇలా పైకి కనిపిస్తున్నాయి. పలువురు భక్తులు ఈ దృశ్యాలను చూసి మన్నించయా అంటూ వేడుకుంటున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి జిల్లా

అగ్రిసెట్ ఫలితాల్లో మెరిసిన మెదక్ జిల్లా విద్యార్థిని

- పెద్దశంకరంపేటకు చెందిన ప్రజ్ఞశ్రీకి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు



పెద్దశంకరంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన 2025 - 26 అగ్రిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలానికి చెందిన బి. ప్రజ్ఞశ్రీ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటింది. రెండేళ్ల వ్యవసాయ డిప్లొమా తర్వాత బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశం కోసం ఆగస్టు 30న ఈ పరీక్ష నిర్వహించారు. తన తల్లిదండ్రులు పల్లవి, శంకర్‌గౌడ్‌తో పాటు సోదరీమణుల ప్రోత్సాహంతోనే సాధ్యమైందని ప్రజ్ఞశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రియాంక కాలనీవాసులు, గ్రామస్థులు ప్రజ్ఞశ్రీని సత్కరించారు.

తెల్లాపూర్ ఐటీ హబ్‌గా మారుతోంది

- మౌలిక వసతులతోనే అభివృద్ధి సాధ్యం
- ఎంపీ రఘునందన్‌రావు

7



కొనుగోళ్లకు సన్నద్ధం

సంగారెడ్డి జిల్లాలో 207 కొనుగోలు కేంద్రాలు

దొడ్డురకం ధాన్యం సేకరణకు 187... సన్నరకానికి 20

1.95 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం

నెలాఖరు నుంచే కొనుగోళ్లు ప్రారంభం

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సిద్ధం అయింది. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 207 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం సేకరణకు 187 కేంద్రాలు, సన్న రకం ధాన్యం కోసం 20 కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు.

దిగుబడి అంచనా

ఈ సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 1,39,562 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో దొడ్డు రకం 1,09,610 ఎకరాలు కాగా, సన్న రకం 29,952 ఎకరాలు. భారీ వర్షాల కారణంగా 20 వేల ఎకరాలకుపైగా వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో మొత్తం 3,29,928 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. అందులో, విత్తనాలకు కొంత కేటాయించి, మిగిలిన 1,95,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

కేంద్రాల్లో ఏర్పాట్లు

కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీక్లీనర్లు, వెయింగ్ మిషన్లు వంటి అన్ని వసతులను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా

మిగతా 8వ పేజీలో

కొనుగోళ్ల ప్రణాళిక

ఏ నెలలో ఎంత మేర ధాన్యం కొనుగోలు చేయాలో ప్రణాళిక రూపొందించారు. దసరా తర్వాత కోతలు ఊపందుకోనున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. నవంబరు నెలల్లో కేంద్రాలకు ధాన్యం పోటెత్తే అవకాశం ఉన్నదని అంచనా. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపు కోసం వాహనాల టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో 66 రైస్ మిల్లులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. వాటిలో 26 బాయిల్డ్ మిల్లులు, 40 రా రైస్ మిల్లులు ఉన్నాయి.

నెలల వారీగా కొనుగోలు వివరాలు

నెల	మెట్రిక్ టన్నులు
అక్టోబరు	5 వేలు
నవంబరు	1,32,000
డిసెంబరు	58,000

నిబద్ధతతో పనిచేయాలి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలనా అధికారులు(జీపీవో)లు నిబద్ధతతో పనిచేయాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి సూచించారు. సంగారెడ్డి జిల్లాలో 355 మంది దరఖాస్తు చేసుకోగా, 238 మందికి పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి జీపీవోలుగా తిరిగి రెవెన్యూ శాఖలో నియమిస్తూ నియామక పత్రాలను ప్రభుత్వం అందజేసింది. తమకు తిరిగి అవకాశం కల్పించినందుకు సంతోషం వ్యక్తం చేసిన జీపీవోలు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మాధురిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అదనపు కలెక్టర్ జీపీవోలకు శుభాకాంక్షలు తెలిపారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మాధురికి పూల మొక్కను అందజేస్తున్న జీపీవోలు

వంద రోజుల ప్రణాళిక పూర్తి

- ప్లాస్టిక్ నిషేధంపై మెదక్‌లో ర్యాలీ

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో శానిటేషన్, తడి, పొడి చెత్త నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన వంద రోజుల ప్రణాళిక బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఉద్యోగులంతా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ మహేశ్, ఏఈ నితిన్ తదితర అధికారులు, శానిటేషన్ సిబ్బంది వార్డుల వారీగా కార్యక్రమాలు నిర్వహించి, తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



మెదక్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు



భూమిని కాపాడుదాం.. భవిష్యత్తుకు భరోసానిద్దాం

- మెదక్‌లో పర్యావరణ పరిరక్షణపై ఆకట్టుకున్న చిన్నారుల నాటకం



భూమిని కాలుష్యం నుంచి కాపాడే బాధ్యత మానవాలి అందరిదీ అని చాటిచెప్పిన సందేశాత్మక ప్రదర్శన ఆలోచింపజేసింది. మెదక్ పట్టణంలోని ప్రధాన కూడలి రాందాస్ చౌరస్తాలో బుధవారం మధ్యాహ్నం గీత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటకం పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని తెలియజేసింది. విద్యార్థులు సేవ్ వాటర్, సేవ్ ఎర్త్, సేవ్ లైఫ్, వంటి ప్లకార్డులు పట్టుకుని, భూమిని కాపాడుదాం - భవిష్యత్తును రక్షిద్దాం, ప్లాస్టిక్ వాడకండి - ప్రకృతిని కాపాడండి అంటూ నినాదాలతో కూడలిని హోరెత్తించారు. చిన్నారులు వృక్షాల చిత్రాలతో కూడిన బోర్డులు పట్టుకుని, శ్రామిక రైతుల వేషధారణలో, రాళ్ల బుట్టలు మోస్తున్నట్లుగా అభినయిస్తూ చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. భూకాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం వల్ల ఏర్పడే ముప్పుపై ప్రజలను మేల్కొలపడమే లక్ష్యమని విద్యార్థులు వీధి నాటక రూపంలో స్పష్టం చేశారు. ఈ ప్రదర్శన కేవలం నాటకం కాదని, భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలనే సందేశమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

- మెదక్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)

పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో వల

- రూ.5.22 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

పటాన్‌చెరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టెలిగ్రామ్ యాప్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన పటాన్‌చెరు పరిధిలో చోటుచేసుకున్నది. సైబర్ నేరగాళ్లు ఏకంగా ఓ వ్యక్తి నుంచి రూ.5.22 లక్షలు కొట్టేశారు. పటాన్‌చెరు ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యనగర్‌లో నివసించే శ్రీనివాసరావు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆగస్టు నెల 2 తేదీన అతడికి టెలిగ్రామ్ యాప్ ద్వారా పార్ట్‌టైమ్ జాబ్ ఆఫర్ వచ్చింది. అందులోని లింక్‌ను క్లిక్ చేసి, వారు చెప్పినట్లుగా ఆన్‌లైన్ ఖాతా తెరిచారు. మొదట రూ.10 వేలు జమ చేయగా, ట్రావెల్‌కు సంబంధించిన టాస్క్‌లు పూర్తి చేసినందుకు రూ.1,120 లాభం చూపించారు. ఆ తర్వాత పలుమార్లు జమ చేసిన డబ్బుకు వచ్చిన లాభం నుంచి రూ.40 వేలు విత్‌డ్రా చేసుకోనిచ్చారు. లాభాలు వస్తున్నాయని నమ్మిన శ్రీనివాసరావు మూడు దఫాలుగా రూ.5.22 లక్షలు పెట్టుబడి పెట్టారు. లాభంతో కలిపి రూ.7.17 లక్షలు విత్‌డ్రా చేయబోగా, ట్యాక్స్ కట్టాలని చెప్పడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేరుకే పశువైద్యశాల

వీధి కుక్కల ఆపరేషన్లకే పరిమితం

ప్రయోజనం లేని కందిలోని జిల్లా వెటర్నరీ ఆస్పత్రి

పట్టించుకోని అధికారులు

సిబ్బంది కొరతతో నిలిచిన సేవలు



కంది, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనం కోసం, పశువుల రక్షణ కోసం రూ.4కోట్ల వ్యయంతో కంది మండలం, కాశీపూర్‌లో నిర్మించిన జిల్లా పశువైద్య కేంద్రం నిరుపయోగంగా మారింది. 2021లో నిర్మించిన ఈ కేంద్రం కేవలం పట్టణ ప్రాంతాల్లోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు మాత్రమే పరిమితమైంది.



వృథాగా మారిన పశువులకు వైద్యంచేసే చోటు

అనుకున్నదొకటి.. అయ్యింది మరొకటి

జిల్లా పశువైద్యశాల ద్వారా తమ పశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనం ఇప్పుడు ఏబీసీ(యానిమల్ బర్త్ సెంటర్)గా మారింది. పశువులకు శస్త్రచికిత్సలు, వైద్య సేవలు అందించడానికి ప్రత్యేక ఆపరేషన్ థియేటర్, వైద్య సిబ్బంది గదులు ఉన్నప్పటికీ, వాటిని వినియోగించడం లేదు. పశువైద్యశాల గ్రౌండ్‌ఫ్లోర్‌లో కేవలం శిక్షణ తరగతులు నిర్వహిస్తుండగా, మిగిలిన సగభాగం సంగారెడ్డి మున్సిపాలిటీలోని వీధి కుక్కల ఆపరేషన్లకు కేంద్రంగా మారింది. అంతేకాకుండా, గతంలో సంగారెడ్డిలో ఉన్న జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలను పశువైద్యశాలలోని పైఅంతస్థులోకి మార్చారు.

ట్రైనింగ్‌కు ఉపయోగించుకుంటున్నాం

జిల్లా పశువైద్యశాలను కాశీపూర్‌లో నిర్మించినప్పటికీ సంగారెడ్డిలోని రైతులు, ప్రజలు, అధికారులు జిల్లా పశువైద్యశాల సంగారెడ్డిలోనే ఉండాలని కోరారు. తమ పెంపుడు జంతువులను సంగారెడ్డి పశువైద్యశాలకే తీసుకొస్తున్నారు. కాశీపూర్‌లోని పశువైద్యశాలలోని మొదటి అంతస్థులో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో కింద కొన్ని గదులు సిబ్బందికి, రైతులకు ట్రైనింగ్ ఇవ్వడానికి ఉపయోగించుకుంటున్నాం. మరి కొంతభాగం ఏబీసీ యానిమల్ బర్త్ సెంటర్‌గా మార్చాం. ఇప్పుడు అక్కడ వైద్య సేవలు అందించడానికి ఒక వెటర్నరీ డాక్టర్, ఒక సబార్డినేట్‌ను నియమించాం.

-వసంతకుమారి, పశుసంవర్ధక శాఖ జేడీ

కూలీ అదృశ్యం


విజయ్ (ఫైల్)

రామచంద్రాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లేబర్ షెడ్ నుంచి బయటకు వెళ్లిన కూలీ అదృశ్యమైన ఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన విజయ్(45) అపర్ణ నిర్మాణ సంస్థలో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే లేబర్‌షెడ్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 7న కిరాణ సామాన్ల కొనుగోలు కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లి రెండు రోజులైనా తిరిగి రాలేదు. అతడి బంధువు ఒకరు కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో కోర్టు ఎప్పుడు?

● పూర్తికాని ఐవోసీ భవనం
● ఎంపీడీఓ కార్యాలయం ఖాళీ చేసేదెప్పుడో..


తూప్రాన్‌లోని ఐవోసీ భవనం

తూప్రాన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ఏర్పాటుకు మూడేళ్లు గడిచిపోతున్నా అడుగులు ముందుకు పడటంలేదు. ఇదిగో.. అదిగో అంటూ ప్రకటనతో కాలం గడిచిపోతుందే తప్పా ఏర్పాటు ముందుకు కదలలేదు. ఆరునెలలుగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ పనులు ఆ స్థాయిలో జరగడంలేదు. జిల్లాలో పునర్విభజనతో గజ్వేల్ నియోజకవర్గం (కోర్టు పరిధి)లో ఉన్న తూప్రాన్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ మెదక్ జిల్లాలో చేర్చారు. జిల్లాల పునర్విభజనతో తూప్రాన్, అల్లాదుర్గంలలో కోర్టులు ఏర్పాటు చేయాలని 2022 మే 12న హైకోర్టు సూచించింది. తూప్రాన్, అల్లాదుర్గం లతో జూనియర్ సివిల్ జడ్జీల కోర్టులు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇందుకు అవసరమైన వసతి భవనం కల్పించాలని సూచించారు.

మే 20న మెదక్ 8వ అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి కే. మారుతీదేవి తూప్రాన్‌లో భవనాలు పరిశీలించారు. 2023 అక్టోబరులో 57 కోర్టులను మంజూరు చేయగా అందులో అల్లాదుర్గం కోర్టు ఏర్పాటు ఉన్నప్పటికీ తూప్రాన్‌లో ఏర్పాటుకు చోటు దక్కలేదు. కోర్టుల ఏర్పాటుకు భవనాలు చూపడంతో అల్లాదుర్గం, జిన్నారం, సిద్దిపేట కోర్టులు ఏర్పాటు చేశారు. తూప్రాన్ కోర్టు ఏర్పాటు అడుగులు ముందుకు పడటంలేదు.

నిలిచిపోయిన పనులు

తూప్రాన్ పట్టణానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఏర్పాటుకు భవనాల ఎంపికకే కాలం గడిచిపోతుంది. తూప్రాన్‌లో పలు భవనాలు చూసినప్పటికీ న్యాయాధికారులకు నచ్చకపోవడంతో చివరకు తూప్రాన్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎంపిక చేశారు. కోర్టుకు ఎంపీపీ కార్యాలయం ఎంపిక చేయగా ఎంపీపీ కార్యాలయాన్ని తూప్రాన్ పట్టణంలో వృధాగా ఉన్న వెజ్ నాన్‌వెజ్ మార్కెట్‌లోకి మార్చేందుకు నిర్ణయించారు. ఆ భవనంలో మార్పులు చేర్పులు చేసేందుకు ఖర్చు చేయడం వృధా భావించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచనలతో చివరకు అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐఓసీ)లోకి ఎంపీపీ కార్యాలయం మార్చాలని నిర్ణయించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాలతో ఐవోసీ భవనంలో పనులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 15 నాటికి ఐవోసీలో మండల ప్రజా పరిషత్, తహశీల్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల గదులు పూర్తి చేయాలని నిర్ణయించారు. పనులను ఆగస్టు 10 తరువాత ప్రారంభించడంతో సెప్టెంబరు ఒకటి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబరు ఒకటి దాటిపోయినా పనులు పూర్తి కాక పోగా, మరో కొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తుంది. 2026లో నైనా కోర్టు ఏర్పాటు చేస్తారా? అంటు పలువురు ప్రశ్నిస్తున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి

● నర్సాపూర్‌లో విక్రయాలు

నర్సాపూర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ఎక్సైజ్ పరిధిలో గంజాయి విక్రయాలు గుట్టుచప్పుడుగా కాకుండా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో తరచూ గంజాయి పట్టుపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అక్రమార్కులు యువత, అడ్డాకూలీలు, పరిశ్రమల్లో పని చేసే కార్మికులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తూప్రాన్, మనోరాబాద్ ప్రాంతాలలో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాంతంలో ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు వస్తుంటారు. వారిని టార్గెట్ చేస్తూ కొందరు గంజాయి అక్రమంగా తరలించి అమ్ముతున్నట్లు సమాచారం. నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలోనూ చాపకింద నీరులా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. పట్టణ సమీపంలోని అర్బన్‌పార్కు వద్ద గంజాయి అమ్ముతుండగా పట్టుకుని వారి వద్ద నుంచి 104 గ్రాముల గంజాయిని ఇటీవల స్వాధీనం చేసుకున్నారు. అర్బన్‌పార్కుకు సెలవుదినాలలో పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. అందులో యువతీయువకులే ఎక్కువగా ఉంటారు. పట్టణంలోని జగన్నాథరావుకాలనీలో ఓ ఇంట్లో అమ్మకానికి అక్రమంగా దాచిన 302 గ్రాముల గంజాయి ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. తాజాగా పట్టణంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని సివిల్ పోలీసులు పట్టుకుని విచారించగా వారి వద్ద 60 గ్రాముల గంజాయి లభించింది. ఇలా పట్టుపడుతున్న సరుకు కొంతేనని, అందరి కళ్లు కప్పి గంజాయి విక్రయాలు సాగుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు అధికారులు స్పందించి నర్సాపూర్‌లో గంజాయి అమ్మకాలను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి పెట్టాం

నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గంజాయి విక్రయాలను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ప్రత్యేక దృష్టి పెట్టాం. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తూ తరుచు తనిఖీలు కూడా నిర్వహిస్తున్నాం. ఎవరికైనా గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. గంజాయిపై నిర్లక్ష్యం చేసేది లేదు.

\- ఎక్సైజ్ సీఐ ముస్తాఫా



వైద్య పరీక్షలన్నీ ఇక్కడే జరగాలి: కలెక్టర్ రాహుల్‌రాజ్


చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


తూప్రాన్ ఆసుపత్రిలో రోగి రిపోర్టు పరిశీలిస్తున్న కలెక్టర్

మెదక్ అర్బన్/తూప్రాన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలన్నీ ఆసుపత్రిలోనే జరగాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. రోగులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలన్నారు. బుధవారం తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. ఫార్మసీ గదికి వెళ్లి మందుల నిలువలు పరిశీలించారు. ఎన్ని నెలలకు మందుల సరఫరా జరుగుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. టీకాల గదిలోకి వెళ్లి ఫ్రిజ్‌లోని వాక్సిన్‌లను పరిశీలించారు. రోగులకు సేవలు అందజేస్తున్న వివిధ విభాగాల గదులను పరిశీలించారు.

చాకలి ఐలమ్మకు నివాళి

భూమికోసం భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోటరాం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని రాహుల్‌రాజ్‌పేర్కొన్నారు. జిల్లా బీసీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి వేడుకలను కలెక్టరేట్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధన..

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధన చేయాలని రాహుల్ రాజ్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని వెస్లీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) జిల్లాస్థాయి మేళాను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠ్యాంశాలు చక్కగా అర్థం కావడానికి బోధనోపకరణాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు.

రాష్ట్రస్థాయికి 8 ప్రాజెక్టులు ఎంపిక

జిల్లాస్థాయి మేళాలో 21 మండలాల స్థాయిలో మొత్తం 208 ప్రాజెక్టులు ప్రదర్శించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన 8 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవోలు ప్రతాప్ రెడ్డి, శంకర్, ఏఎస్‌వో నవీన్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాను ముందు వరుసలో నడిపించండి

● వర్టికల్ విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబర్చాలి
● జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్టికల్ విభాగంలో ఉన్న అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా నిబంధనలు పాటిస్తూ జిల్లాను ముందు వరుసలో నడిపించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతినెలా నిర్వహించే క్రైం రివ్యూ సమావేశంలో ఈ వర్టికల్ ప్రదర్శన ఆధారంగా సమీక్ష జరుగుతుందన్నారు. డయల్ 100 కాల్స్‌కు త్వరితగతిన స్పందించాలని, వీలైనంత తక్కువ సమయంలో నేర స్థలానికి చేరుకొని నేర తీవ్రతను తగ్గించాలి. బ్లూకోర్ట్, పెట్రోకార్ సిబ్బంది తమ ఏరియాలో గల నేరస్థులపై, అనుమానితులపై క్రమం తప్పకుండా నిఘా ఉంచాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఫీడ్ బ్యాక్, క్యూఆర్ కోడ్‌ను అందరికీ కనిపించే విధంగా ఉంచాలి. వివిధ కేసుల్లో నిర్ణీత గడువులోగా చార్జ్‌షీట్లను కోర్టులో సమర్పించాలన్నారు. అన్ని వర్టికల్ విభాగాల్లో మెరుగైన ప్రదర్శన కనబరచినప్పుడే జిల్లా ముందు వరుసలో వుంటుందని అన్నారు. వర్టికల్ విభాగంలో ప్రతిభ ఆధారంగా రివార్డులు అందిస్తామని ఎస్పీ పంకజ్ తెలిపారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు అంబటి రాజు ఎంపిక


అంబటి రాజు గౌడ్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): డెహ్రాడూన్‌లో 2026 ఫిబ్రవరిలో జరగబోయే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కి సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లికి చెందిన అంబటి రాజు ఎంపికయ్యాడు. ఈనెల 9న హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగిన స్టేట్ లెవెల్ సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ జావెలిన్ త్రో ఈవెంట్ లో అంబటి రాజు గౌడ్ మొదటి స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం అంబటి రాజు గౌడ్ వ్యవసాయశాఖలో పని చేస్తూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వద్ద పిఏగా పని చేస్తున్నాడు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య


బాల సదనంలో పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల సదనంలోని పిల్లల పట్ల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య సూచించారు. సంగారెడ్డిలోని బాల సదనం, భరోసా కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల సదనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. మంచి చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆగిన బస్సు.. ప్రయాణికుల తిప్పలు


బస్సు ఆగిపోవడంతో రోడ్డుపైనే ప్రయాణికుల అవస్థలు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరీ డీలక్స్ బస్సు బస్టాండ్ నుంచి బయలుదేరి అర కిలోమీటర్ వెళ్లగానే రోడ్డుపైనే క్లచ్ బాక్స్ పట్టుకొని ఆగిపోయింది. సిద్దిపేట బస్టాండ్ నుంచి సుమారు 50మంది ప్రయాణికులతో హైదరాబాద్ బయలుదేరిన బస్సు మార్గమధ్యంలో ఆగిపోవడంతో ప్రయాణికులు మరో బస్సు వచ్చేవరకు సుమారు 40 నిమిషాలు రోడ్డుపైన వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.





అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

టేక్మాల్ సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని వేంకటపూర్ గ్రామా శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన విరరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా బెస్తాన్నవరిపేట మండలం, బసన్నపల్లి గ్రామానికి చెందిన గోనే గాలయ్య(30) వెంకటపూర్ గ్రామానికి చేందిన దీక్షను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వినాయక చవితి పండగకు వెంకటపూర్ గ్రామానికి వచ్చారు. గాలయ్య సోమవారం రాత్రి బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని ఓ కాలువలో శవమై తేలాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

నిజాంపేట, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన బత్తుల రేణుక (44) కూలి పని చేసుకుంటూ జీవిస్తుంది. అయితే నాలుగు సంవత్సరాల క్రితం కూతురు పెళ్లి సమయంలో చేసిన అప్పులు, సంసారం కుటుంబ పోషణ కోసం తెలిసిన వారి వద్ద అప్పు చేసింది. అప్పులు తీర్చే మార్గం లేక, కుటుంబ పోషణ, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందింది. బుధవారం గడ్డి మందు తాగగా చికిత్స కోసం గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. భర్త బత్తుల చంద్రం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

రూ. 99లకే చీర.. ఎగబడిన మహిళలు

తూప్రాన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో బుధవారం ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ ఆఫర్‌తో మహిళలు ఎగబడ్డారు. మాల్ ప్రారంభం పురస్కరించుకొని ఒక చీరను రూ. 99లకే అందజేస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీంతో మహిళలు పెద్దఎత్తున షాపింగ్ మాల్‌కు తరలి వచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున రావడంతో షాపింగ్ మాల్ మహిళలతో నిండిపోయింది. కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. మహిళలు భారీగా రావడంతో దుకాణ యజమానులు కొంత సమయంలో మహిళలు లోపలికి రాకుండా నిర్వాహకులు తలుపులు వేశారు.



షాపింగ్ మాల్‌లో ఎగబడుతున్న మహిళలు

95 ఏళ్ల కుర్రాడు.. అమీర్ అలీ

ఇప్పటికీ శ్రమజీవనమే..
ఆహార అలవాట్లే ఆరోగ్యం
రోజూ ఐదు కిలోమీటర్ల నడక
ఊర్లకు వెళ్లి తోళ్ల సేకరణ
వంద దాటిన కుటుంబ సభ్యులు



కొడుకులు, కోడళ్లతో అమీర్ అలీ (ఫైల్)



దుబ్బాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయన వయస్సు 90 పైమాటే. ఆధార్ కార్డులో పుట్టిన సంవత్సరం 1931గా నమోదై ఉంది. శతధిక వృద్ధుడని స్థానికులు, అప్పటి తరం వారు చెబుతుంటారు. నాటి గత్తర నుంచి నేటి కరోనా వరకు.. తెలంగాణ విమోచన పోరాటం నుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ఎన్నో ఉద్యమాలను చూసిన ఆయనకు అంతవయస్సు ఉన్నట్లు కనిపించదు. నవయువకుడిలా ఇప్పటికే తన వృత్తి చేసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. రోజూ ద్విచక్రవాహనంపై ఊర్లు తిరుగుతూ తన వ్యాపారం చేస్తారు. తన జీవన విధానమే తన ఆరోగ్యానికి కారణం అంటున్నారు సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన అమీర్ అలీ. తెలిసిన వారంతా ఆయనను తోళ్ల అమీర్ అలీ అని పిలుస్తారు. కుటుంబానికి అన్ని ఉన్నా.. ఆదరించే వారు ఉన్నా.. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు నేర్పిన వృత్తిని ఇంకా వదలకుండా చేస్తూ చివరి వరకు పని చేస్తూనే ఉంటానని అంటున్నారు ఆయన.

మక్క గట్క.. తైద అంబలి

దుబ్బాకకు చెందిన బాషామియా, భానుబీ దంపతులకు ఎనిమిది మంది సంతానంలో ఐదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. వారిలో అమీర్ అలీ రెండో సంతానం. తండ్రి తోళ్లవ్యాపారం చేసి కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నిసార్లు కూలి పనికి కూడా వెళ్లే వారు. తండ్రితో పాటే అమీర్ అలీ కూడా తోళ్ల వ్యాపారంలో మెళకువలు నేర్చుకున్నారు. ఆ సమయంలో తల్లిదండ్రులు చింతగింజలు నానపెట్టుకుని, వాటిని దంచి అంబలిగా చేసుకుని తాగేవారు. దొరికితే మక్క గట్క, తైద అంబలి, సామబువ్వ వండుకుని తినేవారు. అమీర్ అలీ ఇప్పటి అవే ఆహార అలవాట్లు కొనసాగిస్తున్నారు. అదే తన ఆరోగ్య రహస్యమని చెబుతారు. ఇంత వయసులోన రోజూ సుమారు 5 కిలోమీటర్లు నడుస్తారు. రోజూ ఐదుసార్లు నమాజ్ చదవడం, రాత్రి ఖురాన్ పఠనం తప్పనిసరి. ఉదయం 9గంటలలోపే భోజనం చేస్తారు. కాలానుగుణంగా వచ్చే పండ్లను తీసుకుంటారు.

వందమంది దాటిన కుటుంబం

ఆయన వందేళ్లకు చేరువలో ఉండగా, అమీర్ అలీ కుటుంబ సభ్యులు కూడా వంద మంది దాటారనే చెప్పాలి. ఆయనకు ఏడుగుకు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమార్తెలు, కొడుకులకు కలిపి 25 మంది మనుమళ్లు, మనుమరాళ్లు, వారికి 27 మంది సంతానం. ఐదో తరంలోనూ ఆరుగురు పిల్లలు ఉన్నారు. అమీర్ అలీ ఇలా ఐదు తరాలను చూశారు. పండుగల సందర్భంగా వీరిలో చాలా మంది వస్తుంటారు. మూడేళ్ల క్రితం భార్య ఖాజాబీ అనారోగ్యంతో చనిపోయారు.

వృత్తిని వదలని తాత..

కుమారులు, కూమార్తెలు బంధుగణం అంతా బాగా స్థిరపడినా అమీర్‌అలీ మాత్రం తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్న తోళ్ల వ్యాపారం ఇప్పటికీ వదలలేదు. మేక, గొర్రె తోళ్లను సేకరించేందుకు ద్విచక్రవాహనంపై దుబ్బాక మండలంతోపాటు సిద్దిపేట, అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి, తొగుట, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాలకు వెళ్తారు. అక్కడి నుంచి తోళ్లను సేకరించి, వాటిని శుద్ధి చేసి ముషీరాబాద్‌లో విక్రయానికి పంపిస్తారు.



ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా..: అమీర్ అలీ

జీవితంలో అనేక కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కున్నా. తల్లిదండ్రులు కష్టాన్ని నేర్పించారు. వండిన భోజనాన్ని ఎనిమిది మంది పంచుకుని తినేవాళ్లం. రజాకార్ల కాలంలో అమ్మే మమ్మల్ని కాపాడుకుంది. గత్తర వస్తే పెద్ద మనుషులు ఊరుచుట్టూ గోతులు తీసి, ప్రాణమున్న పందులను పాతిపెట్టారు. మనుషులు చచ్చిపోతే ముట్టుకునేవారు కాదు. మేం ఊరు వదిలి బాయికాడ పురుగులు, పాముల మధ్య కాలం వెళ్లదీశాం. ఇప్పటి కరోనా కంటే అప్పటి పరిస్థితి భయంకరంగా ఉండేది. స్కైలాబ్ లాంటి విపత్తును చూశాను. ఎప్పటి నుంచో మక్కా దర్శించుకోవాలని ఉంది. ఈ నెల 25న మక్కా వెళ్లాలనుకుంటున్నా. నా మనవడిని తీసుకుని వెళ్తా.



అరుణాచల్‌ప్రదేశ్ లోని ఎన్ఐఎంఏఎస్ వద్ద సిద్దిపేట ఎన్‌సీసీ కేడెట్లు

స్పెషల్ అడ్వెంచర్ క్యాంప్ పూర్తి చేసిన ఎన్‌సీసీ కేడెట్లు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ కేడెట్లు మందుల సుష్మ , సంజీవ్, వంశీ స్పెషల్ అడ్వెంచర్ క్యాంపును దిగ్విజయంగా పూర్తి చేశారు. ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 4 వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లోని దిరాంగ్ టౌన్‌లో జరిగిన ఈ క్యాంప్‌లో వారు జిప్ లైన్, కృత్రిమ గోడ ఎక్కడం, ట్రెక్కింగ్, రోప్ అబ్‌స్టాకిల్స్ వంటి సాహస కృత్యాలను నేర్చుకున్నారు. ప్రతీ రోజు 24 కిలోమీటర్లు ట్రెక్కింగ్ సాధన చేసి, నాయకత్వ లక్షణాలు, ఫిట్‌నెస్ ప్రాముఖ్యత వంటి అంశాలు నేర్చుకున్నారు. ఎన్‌సీసీ కేడెట్లను, వారి కేర్ టేకర్ బి.కృష్ణయ్యను కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.సునీత బుధవారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాఅయోధ్యరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డా.గోపాల సుదర్శనం, మహిళా సాధికారత సెల్ సమన్వయకర్త గోపిరెడ్డి లీలావతి, సీనియర్ కేడెట్లు పాల్గొన్నారు.

వైద్యంలో రసాయన, జీవశాస్త్రాల పాత్రపై చర్చాగోష్ఠి

- పటాన్‌చెరు గీతంలో సెమినార్
- ముఖ్యఅతిథిగా ఫ్రాన్స్ ప్రొఫెసర్ రెనే గ్రీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఐసీటీ పూర్వ డైరెక్టర్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో 'వైద్యానికి సంబంధించిన పదార్థాలు: రసాయన, జీవశాస్త్రాల పాత్ర' అనే అంశంపై బుధవారం చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫ్రాన్స్‌లోని రెన్నెస్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రెనే గ్రీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పరిశోధనలో ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. బయోమెడికల్ పరిశోధనలో మానవ ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడే డీబీ18 అనే కొత్త నిరోధకం ఆవిష్కరణపై లోతైన సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఐసీటీ మాజీ డైరెక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, పై ల్యాబ్స్‌కు చెందిన డాక్టర్ ప్రథమ, సీసీఎంబీ శాస్త్రవేత్త లాబన్యామోయ్ కోల్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎ.కె.సాహా తదితరులు ప్రసంగించారు. అనంతరం అతిథులు గీతంలోని అత్యాధునిక ప్రయోగశాలలను సందర్శించారు. ఈ సెమినార్‌లో దాదాపు 150 మంది విద్యార్థులు, 20 మంది పరిశోధనా స్కాలర్లు పాల్గొని శాస్త్రీయ పురోగతిపై అవగాహన పెంచుకున్నారు.

'లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించొద్దు'

నారాయణఖేడ్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మాజీ ఎంపీ సోయంబాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించడాన్ని వ్యతిరేకిస్తూ నారాయణఖేడ్‌లో లంబాడాలు వినూత్న నిరసన తెలిపారు. స్థానిక మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలను గాడిదలపై ఉంచి ఊరేగించారు. అనంతరం వాటికి చెప్పులతో కొట్టి, దహనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ మాట్లాడుతూ ఎస్టీ జాబితాలోని లంబాడాలను కాంగ్రెస్ నాయకులు కోర్టును ఆశ్రయించి జాబితాలో నుంచి తొలగింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి లంబాడాల పక్షాన పోరాడాలని కోరారు. నారాయణఖేడ్‌లో ఎస్టీసెల్ నాయకుడు రాజునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో గాడిదలపై నాయకుల చిత్ర పటాలు ఉంచి నిరసన తెలుపుతున్న గిరిజనులు

తెల్లాపూర్ ఐటీ హబ్‌గా మారుతోంది

- మౌలిక వసతులతోనే అభివృద్ధి సాధ్యం
- ఎంపీ రఘునందన్‌రావు
- ఉస్మాన్‌నగర్, అమీన్‌పూర్‌లో రిజర్వాయర్లు ప్రారంభం



ఉస్మాన్‌నగర్‌లో రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రామచంద్రాపురం/అమీన్‌పూర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని తెల్లాపూర్ ఐటీ హబ్‌గా మారుతోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం ఉస్మాన్‌నగర్‌లో రూ.33కోట్లతో నిర్మించిన రిజర్వాయర్‌ను ఎంపీ, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రారంభించారు. అలాగే అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బందంకొమ్ము గ్రామంలో రూ.11.32 కోట్లతో నిర్మించిన మినీ రిజర్వాయర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ, పెరుగుతున్న కాలనీల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అక్రమ వెంచర్లలో ఇళ్లు కట్టుకోవద్దని ప్రజలకు సూచించారు. బిల్డర్లు రోడ్లపై చెత్త వేస్తే సహించేది లేదన్నారు. వేగంగా విస్తరిస్తున్న నగరంలో మౌలిక వసతుల కల్పనతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మున్సిపాలిటీలో నీటి ఎద్దడి లేకుండా ఐదు మినీ రిజర్వాయర్లు నిర్మించామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ (టెనా) అధ్యక్షుడు ఈశ్వరీగారి రమణపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉస్మాన్‌నగర్‌లో రిజర్వాయర్ ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి నీటి బిల్లుల డిమాండ్‌ను రమణ తీసుకువెళ్లారు. దీనితో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే 'నువ్వే లీడర్‌వి, నాకేందుకు చెబుతున్నావు?.. నువ్వే పరిష్కరించుకో' అంటూ మండిపడ్డారు.

ప్రధాని మోదీతోనే దేశం బలంగా నిలబడింది

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ప్రపంచ దేశాల మధ్య భారతదేశం బలంగా నిలబడిందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా చూడాలన్నది మోదీ ఆకాంక్ష అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి 15 రోజులపాటు సేవా పక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రం ఇచ్చిన యూరియాను రైతులకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు ఆందోళన చెందవద్దని, అందరికీ యూరియా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.


సిబ్బందికి తెలియకుండానే ట్రాన్స్‌ఫార్మర్లకు రైతుల మరమ్మతులు

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై డీఈ వివరణ

తూప్రాన్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులు స్వయంగా మరమ్మతు కేంద్రాలకు తరలిస్తున్నారని తూప్రాన్ విద్యుత్ డీఈ గరత్మంతురాజు తెలిపారు. ఈ విషయమై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ట్రబుల్ ఫార్మర్స్' శీర్షికన ప్రచురితమైన కథనం నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. భారీ వరదలతో వెల్దుర్తి, తూప్రాన్, శివ్వంపేట విభాగాల్లోని పలు గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగి దెబ్బతిన్నాయని తెలిపారు. మరోవైపు దీనిపై రైతులు స్పందించి మాట్లాడుతూ స్థానిక విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ల విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి అప్పగిస్తేనే మరమ్మతులకు తీసుకువచ్చినట్లు తెలిపారు. అలాగే, తూప్రాన్ ప్రాంతంలో ఏ గ్రామం ముంపునకు గురికాలేదని, ట్రాన్స్‌ఫార్మర్లు మునిగే స్థాయిలో నీరు రాలేదని వారు చెప్పడం గమనార్హం.

'సస్యరక్షణపై అవగాహన పెంచుకోవాలి'

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సమగ్ర సస్యరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సీపీఎంసీ హైదరాబాద్ ఇన్‌చార్జి సునీత సూచించారు. చిన్నశంకరంపేటలోని రైతు వేదికలో రైతులకు పంటల దిగుబడి, శుద్ధి, పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు వరి పంట సాగు విధానం, దిగుబడి, తెగుళ్ల నివారణ పద్ధతులు వివరించారు. ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్‌లో సస్యరక్షణ పద్ధతులను ఎలా ఉపయోగించాలో చూపించారు. డ్రోన్ సహాయంతో మందుల పిచికారీపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వాసుదేవ్, ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయశంకర్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ఏవో లక్ష్మిప్రవీణ్, ఏఈవోలు మధులిక, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.



వరి పంట దిగుబడిపై అవగాహన కల్పిస్తున్న కేంద్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏడీఏ వాసుదేవ్



మెదక్ జిల్లా శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద అన్నదాతల క్యూ



వెల్దుర్తి మండలంలోని హస్తాల్‌పూర్‌లో..

ఎంతకష్టమొచ్చే..

- రైతులకు తప్పని యూరియా బాధలు
- పీఏసీఎస్‌లు, అగ్రోస్ కేంద్రాల వద్ద భారీ బారులు
- సహనం కోల్పోతున్న అన్నదాతలు
- మిరుదొడ్డిలో కుర్చీలు ధ్వంసం

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో యూరియా కోసం అన్నదాతలు పడరానికి పాట్లుపడుతున్నారు. పడిగాపులు కాయలేక సహనం కోల్పోయి ఆందోళనలు, దాడులకు దిగుతున్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో మంగళవారం అర్ధరాత్రి నుంచి యూరియా కోసం పడిగాపులు కాసినా ఒక్క బస్తా కూడా దొరకలేదని రైతులు మండిపడ్డారు. బుధవారం మిరుదొడ్డికి రెండు లారీల యూరియా రావడంతో టోకెన్ల కోసం రైతులు ఒక్కసారిగా రైతువేదిక లోపలికి దూసుకురావడంతో టోకెన్లను ఇవ్వకుండా సిబ్బంది చేతులెత్తేశారు. దీంతో రైతులు అక్కడి కుర్చీలను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు ప్రత్యేకబలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తూప్రాన్, నిజాంపేట, శివ్వంపేట, కుకునూరుపల్లి, హవేళిఘణపూర్, వెల్దుర్తి, చిన్నశంకరంపేట, దౌల్తాబాద్‌లో రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. కొన్నిచోట్ల తోపులాట జరిగింది. అక్కడక్కడ రైతులు నిరసన తెలిపారు.



మిరుదొడ్డి పీఏసీఎస్ కేంద్రం వద్ద..


సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న చింతా ప్రభాకర్


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సీపీఎం నాయకులు


నిజాంపేటలో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి


పుల్కల్ : చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మది మహోన్నతమైన స్థానమని పలువురు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యేలు, అధికారులు, పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరనారి ఐలమ్మ అని అన్నారు. రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి ఎర్రజెండా పట్టి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు.
- న్యూస్ నెట్‌వర్క్


మెదక్ అర్బన్ : చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నినాదాలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్


జిన్నారం మండలం ఊట్ల గ్రామంలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


చేగుంట మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు


రేగోడు గాంధీ చౌక్ వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించిన నాయకులు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేదలకు వరం

చిన్నశంకరంపేట/పాపన్నపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఒక వరమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో దామోదర్, ఆర్‌ఐ రాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ, మాజీ సర్పంచులు పాల్గొన్నారు. అలాగే పాపన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 66 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రోహిత్‌రావు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో విష్ణువర్ధన్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలి : సంజీవరెడ్డి

మనూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బాదల్‌గాం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాన్ని బట్టి బిల్లులు మీ బ్యాంకు ఖాతాలో జమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, అమృత్, ప్రభుయాదవ్, నర్సింలు పాల్గొన్నారు. కాగా బాదల్‌గాం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అంజయ్య బుధవారం ఉద్యోగ విరమణ కావడంతో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.


బాదల్‌గాంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మరాఠా ఉద్యమ స్ఫూర్తితో కలిసి నడుద్దాం

పటాన్‌చెరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మరాఠాలు చేసిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని కలిసి నడవాలని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు అన్నారు. బుధవారం కరీంనగర్‌లో తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చే వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. రాజకీయంగా ఎదగాలంటే కలిసికట్టుగా ప్రయాణం చేయాల్సి ఉంటుందని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముదిరాజ్‌లు 15 ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ముదిరాజ్‌ల సత్తా చూపించాలన్నారు. రాష్ట్రంలో ముదిరాజ్‌ల ఓట్లు అత్యధికంగా ఉన్నాయని వివరించారు. కొత్తగా వచ్చిన యువకులు ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకరబోయిన మహేష్, నర్సయ్య, రాము, చెంచు శ్రీనివాస్, దేవరాజు, రవి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్ బహిరంగసభలో మాట్లాడుతున్న నీలం మధు

శేఖాపూర్‌లో ఘనంగా ఉర్సు

● పాల్గొన్న మాజీమంత్రి హరీశ్‌రావు


దర్గాకు చాదర్ సమర్పిస్తున్న హరీశ్‌రావు

జహీరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని శేఖాపూర్ గ్రామంలో గల హజ్రత్ షేక్‌శహబుద్దీన్ తుర్కీ రహమతుల్లా దర్గా ఉర్సు మూడురోజులుగా కొనసాగాయి. మంగళవారం రాత్రి మాజీ మంత్రి హరీశ్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్దం ఉజ్వల్‌రెడ్డి, పలువురు హాజరై చాదర్‌ను సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా దర్గా వద్ద నిర్వహించిన ఖవ్వాలి పోటాపోటీగా జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, నాయకులు తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, పట్టణ సీఐ శివలింగం, ఎస్‌ఐలు వినయ్‌కుమార్, కాశీనాథ్, నరేష్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● మెదక్ డీఎంహెచ్‌వో శ్రీరామ్


నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీరామ్

చేగుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెదక్ డీఎంహెచ్‌వో శ్రీరామ్ అన్నారు. బుధవారం నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం టీబీ కార్యక్రమంపై సమీక్షించి మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూసుకోవాలని డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట ఏవో డాక్టర్ హరిప్రసాద్, వైద్యాధికారులు రేఖ, రవికుమార్, వైశాలి, సిబ్బంది తదితరున్నారు.

సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా పాండు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 10 : సంగారెడ్డి రెవెన్యూ డివిజన్ ఇన్‌చార్జి అధికారిగా (ఆర్డీవో) ఆర్.పాండు బుధవారం బాధ్యతలు చేపట్టారు. జోగిపేట-అందోల్ ఆర్డీవోగా పనిచేస్తున్న పాండుకు సంగారెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీచేశారు. కొంతకాలం ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన రవీందర్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండానే రెవెన్యూశాఖకు రిపోర్ట్ చేయాలంటూ ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన పాండును రెవెన్యూ అధికారులు సత్కరించారు.


సంగారెడ్డి ఇన్‌చార్జిగా ఆర్డీవో పాండు

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

జిన్నారం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మున్సిపాలిటీ శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి గాయపడగా.. మరో వ్యక్తి మృతిచెందాడు. జిన్నారం శివారులోని శివాజీ స్టేడియం వద్ద ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి 10:30 గంటలకు ఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. బైక్‌లపై ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో నర్సింగ్‌రావు(48) మండలంలోని దాదిగూడెం, మరొకరు నర్సాపూర్ మండలం కాజగ్‌మద్దూర్ వాసిగా తెలిసింది. ఘటనా స్థలాన్ని జిన్నారం ఎస్‌ఐ హనుమంతు సందర్శించారు. అయితే పరిస్థితి విషమించి నర్సింగ్‌రావు అనే వ్యక్తి మృతిచెందాడు.

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి : ఎమ్మార్పీఎస్

చేగుంట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మందు రెండువేలు ఉన్న పెన్షన్ రూ.4 వేలు పెంచుతానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి భోజ సైదులు పేర్కొన్నారు. బుధవారం చేగుంట మండలం కర్నాల్‌పల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ జిల్లా సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా పెన్షన్ పెంపు విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇచ్చినహామీలు నిలబెట్టుకోనందున ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రేపు జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ముట్టడికి బీడీ కార్మికులు, వికలాంగులు, గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుపుల రామస్వామి, నాయకులు మురళీ, యాదగిరి, సాయిబాబా, శంకర్, సుధాకర్, పాండు, స్వరూప, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో అధిక మొక్కలు నాటాలి

కౌడిపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వన మహోత్సవంలో భాగంగా ప్రతీ గ్రామంలో విరివిగి మొక్కలు నాటాలని డీఆర్డీవో (జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి) శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన వారికి పశువుల పాకలు, గొర్రె, మేకలు, కోళ్ల షెడ్లు వేయించి ఉపాధి కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో పాల్గొన్నారు.


ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీనివాస్

కొనుగోళ్లకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

ఈ సీజన్‌లో 1.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నెలాఖరు నుంచే ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్నాయి.

కేంద్రాల వివరాలు

సివిల్ సప్లై, వ్యవసాయ, డీఆర్‌డీఏ, డీసీఎంఎస్ శాఖలు కలిసి ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాయి. ఏకేపీ (ఇందిరా క్రాంతి పథకం) ద్వారా 89 కేంద్రాలు, పీఏసీఎస్ (ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘం) ద్వారా 88 కేంద్రాలు, డీసీఎంఎస్ (జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) ద్వారా 30 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

బంగారమ్మ ఆలయంలో 'మైనంపల్లి' పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు

మనోహరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం కాళ్లకల్ బంగారమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డితో కలిసి బుధవారం పూజలు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఆలయానికి చేరుకుని పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు నాచారం గుడి మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అనారోగ్యానికి గురికాగా.. మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ మహేందర్‌రెడ్డిని పరామర్శించారు. ఇందులో సీనియర్ నాయకులు జావీద్‌పాషా, సాయిబాబా, ధర్మేందర్, నరేన్, మాల్లారెడ్డి, నాగరాజు, భానుచందర్, వేంకటేష్, సార్విన్‌గౌడ్ ఉన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు అవసరం : ఎస్పీ

మెదక్ అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకోవడంతోపాటు మానసికోల్లాసానికి క్రీడలు అవసరమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న క్రికెట్ మైదాన పనులను ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐలు రాజశేఖర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించండి

నిజాంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా యూరియా పంపిణీ చేయాలని, కార్యాలయంలో సమయపాలన, క్లైమ్, అభ్యంతరాలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా 100 ఏళ్ల పైబడి ఉన్న ఓటర్ లిస్ట్ జాబితాను సరిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ, ఆర్ఐ ఇమద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో డబుల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు

నారాయణఖేడ్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మూడు గుంటల్-సిర్గాపూర్ రోడ్డును డబుల్‌రోడ్డుగా ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రామక్రిష్ణ, మండల అధ్యక్షుడు సిందోల్ దశరత్ అన్నారు. బుధవారం మూడు గుంటల్-సిర్గాపూర్ రోడ్డును బీజేపీ నాయకులతో కలిసి వారు పరిశీలించి మాట్లాడారు. గతంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప ద్వారా కేంద్రమంత్రి బండి సంజయ్‌కు మూడు గుంటల్, సంజీవన్‌రావుపేట, సిర్గాపూర్ మీదుగా డబుల్‌బెడ్‌రూం రోడ్డు నిర్మింప చేయాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. వారి వెంట సంజీవన్‌రావుపేట మాజీ సర్పంచ్ ఎంబరి విఠల్, యువ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ పట్నం మాణిక్, మండల ప్రధాన కార్యదర్శి కనికేందర్, నాయకులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లా క్రీడలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

తూప్రాన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని గీతాస్కూల్ విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో ప్రతిభచూపి ఉమ్మడి జిల్లా క్రీడలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-14 బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో ఇద్దరు ప్రతిభచూపి, ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కరెస్పాండెంట్ రామాంజనేయులు, చైర్‌పర్సన్ ఉష అభినందించారు.

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు

నర్సాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు అని మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి అన్నారు. 'ప్లాస్టిక్‌ను వాడొద్దు.. ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు' నినాదంతో స్థానిక గీత స్కూల్ విద్యార్థులు ప్రధాన వీధుల గుండా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మధుసుదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, గీత స్కూల్ ప్రిన్సిపాల్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రారం-చందంపేట రోడ్డుకు మరమ్మతులు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలో కురిసిన భారీ వర్షాలకు రుద్రారం-చందంపేట రోడ్డు మార్గంలో ఉన్న బ్రిడ్జి కుంగిపోయి కూలింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా మాజీ సర్పంచ్ శ్రీలతస్వామిరాజ్ బుధవారం సొంత డబ్బులతో రోడ్డుపై తాత్కాలిక మరమ్మతులు చేయించారు. దీంతో రాకపోకలు సాగుతున్నాయి.

పైర్లకు నానో యూరియా ఎంతో మేలు

రామాయంపేట/హవేళిఘణపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యూరియా బ్యాగులో దొరికే పోషకాలన్నీ ద్రవరూపంలో లభించే నానో బాటిల్లో ఉంటాయని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్, రామాయంపేట సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ సూచించారు. అందువల్ల మార్కెట్లో సులువుగా లభించే ఈ ద్రావణాన్ని వాడాలన్నారు. బుధవారం వారు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రైతులు నానో లిక్విడ్‌ను జిల్లాలో 5 శాతం మాత్రమే వినియోగిస్తున్నారన్నారు. దీంతో డిమాండ్‌కు తగ్గట్టు వచ్చినా కొరత ఏర్పడుతుందని చెప్పారు. దీనిపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు నానో టెక్నాలజీ వరంలాంటిదని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని హవేళిఘణపూర్ గ్రామ శివారులోని లక్ష్మీనారాయణ పొలంలో నానో యూరియా, పొటాష్‌ల పిచికారీపై అవగాహన కల్పించారు.


హవేళిఘణపూర్‌లో డ్రోన్‌తో స్ప్రే చేయిస్తున్న ఏవో బాల్‌రెడ్డి